ఈరోజు (1 మే) సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో మే డే కార్యక్రమం జరిగింది. ఆ వివరాలను ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. – సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయం తరపున

**మతోన్మాద, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా**
**పోరాడేది కమ్యూనిస్టులే**
**సిపిఎం సీనియర్ నాయకులు పి మధు**
**సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో మేడే వేడుకలు**

కేంద్రంలోని నరేంద్రమోడీ అవలంభిస్తున్న మతోన్మాద, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సిద్ధాంతం కమ్యూనిస్టులు, వామపక్షాలకే ఉందని సిపిఎం సీనియర్ నాయకులు పి. మధు అన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులకు ప్రత్యామ్నాయం సోషలిజమే తప్ప మరోకటి కాదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయం (కాట్రగడ్డ శ్రీనివాసరావు భవన్‌లో)లో ఆదివారం మే డే సందర్భంగా పార్టీ జెండాను పి.మధు ఆవిష్కరించారు. అనంతరం మధు మాట్లాడుతూ కేంద్రంలోని రెండో సారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని, ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ముస్లిం మైనార్టీలపై రకరకాల పద్ధతుల్లో దాడులు చేసేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందని విమర్శించారు. మోడీ దూకుడు విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రతిఘటనలు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్ హామీలను బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అయినా వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి వంతపాడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వారంలోపు రద్దు చేస్తానని హామీనిచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. సిఎం వైఎస్ జగన్ ఉద్యోగాస్తులతో చర్చించి సిపిఎస్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం తుదివరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

**కార్మిక హక్కులను అణచివేస్తున్న మోడీ: వి శ్రీనివాసరావు**

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ కార్మిక హక్కులను అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న 44 చట్టాలను ఒక్క కలం పోటుతో రద్దు చేసిందన్నారు. కార్మికుల హక్కు, గళం నొక్కేసేందుకు కార్మిక కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను అంబానీ, ఆదానీలకు కట్టబెట్టి ఆదానీప్రదేశ్‌గా మార్చేందుకు మోడీ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. మోడీకి తాళం వాయిస్తూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి భూమి,నీరు, అటవీ, పోర్టులు అన్నింటినీ అంబానీ, ఆదానీల పరం చేసి రాష్ట్రాన్ని దిక్కులేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం మోడీ నిరంకుశ ప్రభుత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కంకణబద్దులై మేడే సందర్భంగా దీక్ష పూనాలని రాష్ట్ర ప్రజలను కోరారు. కార్మిక వర్గం ఐక్య పోరాటాలతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని అన్నారు.

= = = =